4 నుంచి టీటీడీ ఆలయాల్లో విశేష ఉత్సవాలు

షెడ్యూల్‌ను ప్రకటించిన టీటీడీ

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయాల్లో జూలైలో జరుగనున్న విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ అధికారులు వెల్లడించారు. ఈ నెల 4 నుంచి 14 వరకు నారాయణవనంలో పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, 10 నుంచి 12 వరకు శ్రీనివాసమంగాపురంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి సాక్షాత్కార వైభవోత్సవాలు, 16 నుంచి 18 వరకు తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో వార్షిక జ్యేష్టాభిషేకం, 17 నుంచి 25వ వరకు తాళ్లపాకలోని సిద్ధేశ్వరస్వామి, చెన్నకేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు, 26న సిద్ధేశ్వర స్వామి, చెన్నకేశ్వర స్వామి ఆలయాల్లో వార్షిక పుష్పయాగం, 29న ఆండాళ్ అమ్మవారి తిరువడిపూడి ఉత్సవం, 30న తిరుపతిలోని కోదండరామ స్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 31న సర్వ ఏకాదశి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

అటవీ-పర్యావరణ, కాలుష్య నియంత్రణ అధికారుల బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ) : అటవీ-పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శిగా అహ్మద్ నదీమ్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కోమెంబర్ సెక్రటరీగా రవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖను కలిసి పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలు, నిధులు, కేంద్ర ప్రభుత్వ సహకారం తదితర అంశాలపై చర్చించారు.

ప్రాధాన్యాల వారీగా బడ్జెట్ ప్రతిపాదించాలి

హైదరాబాద్, జూలై1 (నమస్తే తెలంగాణ): ప్రాధాన్యాలవారీగా ప్రాజెక్టులకు బడ్జెట్‌ను ప్రతిపాదించాలని ఇరిగేషన్‌శాఖ అధికారులకు ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్ సూచించారు. బడ్జెట్ ప్రతిపాదనలపై చీఫ్ ఇంజినీర్లతో జలసౌధలో సోమవారం ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రాజెక్టులవారీగా అవసరాలపై చర్చించారు.

అంతర్గతంగా బడుల రేషనలైజేషన్

- బదిలీ అయిన వారిని రిలీవ్ చేయని విద్యాశాఖ
- రాష్ట్రంలో 25,036 మంది ఎస్జీటీల బదిలీ

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): లేదు లేదంటూనే పాఠశాల విద్యాశాఖ బడుల రేషనలైజేషన్‌ను అమలుచేసింది. రేషనలైజేషన్ ప్రకారమే టీచర్లను బదిలీచేసింది. దీంతో పలు స్కూళ్లకు టీచర్లను కేటాయించలేదు. విద్యార్థుల సంఖ్యలేని పలు పాఠశాలల్లోని పోస్టులను పక్కనపెట్టింది. కాగా, విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న స్కూళ్లల్లో బదిలీ అయినా టీచర్లను రిలీవ్ చేయలేదు. పాత స్థానాల్లోనే ఉండాలని సూచించింది. దీంతో సంవత్సరాలుగా ఒకేచోట పనిచేస్తూ తాజాగా బదిలీ కాగా, ఈ నిర్ణయంతో వారి ఆనందం క్షణాల్లోనే ఆవిరైంది. దీనిని పలు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయి. బదిలీ అయిన వారిని రిలీవ్‌చేయాలని డిమాండ్ చేశాయి.

బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలని నల్లబ్యాడ్జీలు ధరించిన టీఆర్టీఎఫ్ ప్రతినిధులు

బదిలీపొందిన వారిని రిలీవ్‌చేయాలి: తపస్

బదిలీఅయిన టీచర్లందరిని వెంటనే రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. అవసరమైతే విద్యావలంటీర్లను నియమించాలని రాష్ట్ర అధ్యక్షుడు కే హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ కోరారు. చాలా మందిని రిలీవ్ చేయకపోవడంతో ఎస్జీటీలు ఎక్కడివారు అక్కడే ఉండే పరిస్థితి నెలకొన్నదని వాపోయారు. యూపీఎస్‌లోని ఎస్జీటీ పండితులను సైతం రిలీవ్‌చేయాలని సూచించారు.

రిలీవ్‌చేయాలని టీఆర్‌టీఎఫ్ నిరసనలు

బదిలీ అయిన టీచర్లను రిలీవ్‌చేయాలని డిమాండ్‌చేస్తూ తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసనలు చేపట్టింది. అంతర్గత రేషనలైజేషన్ వల్ల విద్యార్థులకు గుణాత్మకమైన విద్య దూరమవుతుందని అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ప్రతి పాఠశాలను తెరవాలన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేయాలని డిమాండ్ చేశారు.

50శాతం ఎస్జీటీల బదిలీలు

రాష్ట్రంలో 50,808 మంది ఎస్జీటీలు(సెకండరీ గ్రేడ్ టీచర్లు) పని చేస్తుండగా, సోమవారం 25,036 మంది బదిలీ అయ్యారు. అంటే 50శాతం టీచర్లకు స్థానచలనం కలిగింది. ఇక రంగారెడ్డి జిల్లాలో 955 మంది స్కూల్ అసిస్టెంట్లు స్థానం చలనం పొందారు. ఇక సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తారు. ఆ తర్వాత సెకండరీ గ్రేడ్ టీచర్లను బదిలీ చేస్తారు. దీంతో రాష్ట్రంలో టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రి య ముగుస్తుంది.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్, జూలై1 (నమస్తే తెలంగాణ): బీసీ గురుకులాల్లో ప్రవేశాల కోసం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. ఈ మేరకు ఆన్‌లైన్ అడ్మిషన్ రిక్వెస్ట్ ఫామ్‌ను అప్‌లోడ్ చేసింది.

తృణమూల్ నేత 'జేసీబీ' అరెస్ట్

కోల్‌కతా: వివాహేతర సంబంధం కలిగి ఉన్నారని ఆరోపిస్తూ ఓ జంటను నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా చితకబాదిన టీఎంసీ నేత తజిముల్ ఇస్లాం వురపు జేసీబీని ఆదివారం అరెస్ట్ చేసినట్లు పశ్చిమ బెంగాల్ పోలీసులు వెల్లడించారు. లఖిపూర్ గ్రామ పంచాయతీలోని దిఘల్‌గావ్ గ్రామం లో జూన్ 28న తజిముల్ బహిరంగంగా ఓ మహిళను, ఓ పురుషుడిని దారుణంగా కొట్టినట్లు కనిపిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులు

దశల వారీగా రోడెక్కనున్న బస్సులు - కొత్తగా 450 బస్సుల రాక

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): టీజీఎస్‌ఆర్టీసీ త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ఇటీవలే హైదరాబాద్-విజయవాడ మధ్య ప్రయోగాత్మకంగా గరుడ ప్లస్ క్యాటగిరీతో 10 ఎలక్ట్రిక్ బస్సులను నడిపిన ఆర్టీసీ, ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా వీటిని ప్రారంభించాలని నిర్ణయించింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ క్యాటగిరీల్లో ఎలక్ట్రిక్ బస్సులు నడవనున్నాయి. కొత్తగా 450 బస్సులు వారం తర్వాత దశల వారీగా రోడ్డెక్కనున్నట్లు ఆర్టీసీ

తెలిపింది. హైదరాబాద్ నుంచి నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, సూర్యాపేట మధ్య కొత్త ఎలక్ట్రిక్ బస్సులు నడుపనున్నట్లు తెలుస్తున్నది. నేషనల్ ఎలక్ట్రిక్ బస్ కార్యక్రమం కింద ఇవి మంజూరయ్యాయి.

నార్కోటిక్ యాక్టుపై ఎక్సైజ్ సిబ్బందికి శిక్షణ

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ) : సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య ఎక్సైజ్ ఉన్నతాధికారులకు శిక్షణ ఇచ్చారు. ఏడేండ్లు జెలు శిక్ష కలిగిన కేసు నమోదు చేస్తే పూర్తి స్థాయిలో వీడియో తీసి న్యాయమూర్తి ముందు ఎలా ఉంచాలనే విషయంపై అవగాహన కల్పించారు. నేర పరిశోధన సమయం లో డ్రగ్స్ పట్టుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. శిక్షణలో 139 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

జంతు రవాణాపై వివరణ ఇవ్వండి

హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): జంతువుల రవాణాకు సంబంధించి 2017లో రూపొందించిన నిబంధనలు ఏవిధంగా అమలవుతున్నాయో వివరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. జంతు రవాణా నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదంటూ అందిన లేఖను ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)గా కోర్టు పరిగణించింది. కౌంటర్ దాఖలు చేయాలని హోం, రవాణా, పశుసంవర్ధక శాఖల ముఖ్య కార్యదర్శులతోపాటు డీజీపీని, జీహెచ్‌ఎంసీని, పోలీస్ కమిషనర్లను ఆదేశిస్తూ.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

మధ్యప్రదేశ్‌లో బురారీ తరహా ఘటన

రైతు కుటుంబం మూకుమ్మడి ఆత్మహత్య!

భోపాల్: 2018 జూలై 1న.. ఉత్తర ఢిల్లీలోని బురారీలో ఒకే కుటుంబానికి చెందిన 11 మంది సామూహికంగా ఆత్మహత్య చేసుకోవడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఇదే తరహా ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకున్నది. అలీరాజ్‌పూర్ జిల్లాలో ఓ రైతు కుటుంబం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడటం కలకలం రేపింది. తల్లిదండ్రులు, ముగ్గురు పిల్లలు అనుమానాస్పద స్థితిలో సోమవారం తమ ఇంట్లోని సీలింగ్‌కు వేలాడుతూ, మరణించి కనిపించారు. మృతులను రాకేశ్ సింగ్, ఆయన భార్య లలిత, కుమార్తె లక్ష్మి, కుమారులు ప్రకాశ్, అక్షయ్‌గా గుర్తించారు. వీరి బంధువులు వీరి ఇంటికి వచ్చి, తలుపులు తెరచి చూసే సరికి మృతదేహాలు కనిపించడంతో, పోలీసులకు సమాచారం ఇచ్చారు.

శ్రీలంక తమిళ నేత సంపంథన్ కన్నుమూత

కొలంబో: శ్రీలంక తమిళ నేత ఆర్ సంపంథన్ (91) ఆదివారం కన్నుమూశారు. ఆయన ఆ దేశంలోని తమిళులకు శాంతి, న్యాయం, గౌరవాల కోసం నిరంతరం పోరాడారు. శ్రీలంకలో ప్రధాన ప్రతిపక్ష నేత అయిన తమిళ నేతల్లో ఆయన రెండోవారు. సంపంథన్ మృతి పట్ల ప్రధాని మోదీ, తమిళనాడు సీఎం స్టాలిన్ శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే తెలిపారు.

నిమ్స్‌కు చెక్‌ను అందజేస్తున్న రోటరీ క్లబ్, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ ప్రతినిధులు

నిమ్స్‌కు 2.1 కోట్ల విరాళం

కొండాపూర్, జూలై 1 : పిల్లల సంరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, పీడియాట్రిక్ ఎపిలెప్సీ సెంటర్ స్థాపన, క్రెష్ సౌకర్యాల పునరుద్ధరణ లక్ష్యంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)కు ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ రూ. 2.1 కోట్ల విరాళం అందజేసింది. సోమవారం మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్, నిమ్స్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాజెక్ట్‌కు సంబంధించిన మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో శరత్‌చౌదరి, జ్ఞాన్‌ప్రకాశ్, చరణ్‌జీవ్ సలుజా పాల్గొన్నారు.

'నిమ్స్‌మే' వ్యవస్థాపక దినోత్సవం

హైదరాబాద్, జూలై 1(నమస్తే తెలంగాణ): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్‌మే) 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఐపీఎఫ్‌సీ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్) లబ్ధిదారుకు సంబంధించి 'భారతీయ మసాలా పరిశ్రమ సవాళ్లు, క్షేత్రస్థాయిలో వాటి పరిష్కారాలు' అనే అంశంపై కేస్ స్టడీని విడుదల చేశారు. నిమ్స్‌మేతోపాటు ఇన్నోవేటర్ పీఎస్ఆర్‌వీఎస్ విఠల్ దీన్ని రచించారు. సియంట్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు బీవీఆర్ మోహన్ రెడ్డి, నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ స్వరూప, ఐపీఎఫ్‌సీ అసోసియేట్ ఫ్యాకల్టీ మెంబర్ స్వప్న పాల్గొన్నారు.



లండన్‌లో తెలంగాణ డే వేడుకల్లో పాల్గొన్న భారత హైకమిషనర్ విక్రమ్ దొరై

లండన్‌లో 'తెలంగాణ డే' వేడుకలు

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): లండన్ లోని భారత హైకమిషన్ కార్యాలయంలో మొదటిసారిగా 'తెలంగాణ డే' వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భారత హైకమిషనర్ విక్రమ్ దొరై స్వామి మాట్లాడుతూ ప్రవాసుల్లో ఐక్యత, విదేశీ గడ్డపై భారత సంస్కృతిని ప్రచారం చేసేందుకు వివిధ రాష్ట్రాల ఆవిర్భావ వేడుకలను భారత హైకమిషన్ అధికారికంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) సంస్థ ప్రతినిధులు చురుగ్గా పాల్గొనడమే కాకుండా, తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా ప్రత్యేక నృత్య ప్రదర్శన నిర్వహించారు. టాక్ సంస్థ ప్రతినిధులను హైకమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల మాట్లాడుతూ తెలంగాణ డే వేడుకలను ఇక్కడ నిర్వహించడంపై సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటును ఆకాంక్షిస్తూ గతంలో కేసీఆర్ పిలుపు మేరకు ఎన్నో నిరసన కార్యక్రమాలు చేశామని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస తెలంగాణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. టాక్ సంస్థ సభ్యులు స్వాతి, సుప్రజ, స్నేహ, కుమారి తన్మయ, విద్య చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

బీఎస్ఎన్ఎల్ రూ.249 ప్లాన్

45 రోజుల వ్యాలిడిటీ.. రోజూ 2జీబీ

టెలికం ఇండస్ట్రీలో హాట్ టాపిక్

న్యూఢిల్లీ, జూలై 1: దేశీయ ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కొత్త కస్టమర్లను ఆకట్టుకోవడానికి ఓ నయా ప్లాన్‌ను పరిచయం చేసింది. దీని రేటు రూ.249 మాత్రమే. కాలవ్యవధి 45 రోజులు. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో ఉన్న ఈ ఆకర్షణీయ ప్యాకేజీలో రోజూ 2జీబీ డాటా, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లను వినియోగదారులు వాడుకోవచ్చు. అయితే ప్రైవేట్ రంగ టెలికం కంపెనీలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా.. ఇటీవలే తమ ప్లాన్ల ధరలను భారీగా పెంచుతున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ప్లాన్ ఇప్పుడు టెలికం ఇండస్ట్రీలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. అధిక టారిఫ్‌ల నుంచి ఉపశమనాన్ని కోరుకునే మొబైల్ యూజర్లను ఆకట్టుకునేందుకే బీఎస్ఎన్ఎల్ తక్కువ ధరకే ఎక్కువ ప్రయోజనాలున్న ఈ ప్లాన్‌ను తీసుకొచ్చిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఇతర టెలికం కంపెనీలు ఇదే ధర (రూ.249)కు రోజుకు 1జీబీ డాటానే ఇస్తుండగా, వ్యాలిడిటీ కూడా 28 రోజులే ఉంటుండటం గమనార్హం. దీంతో బీఎస్ఎన్ఎల్ నూతన ప్లాన్‌లో రోజువారీ డాటా రెట్టింపవడమేగాక, ప్లాన్ గడువు కూడా 17 రోజులు పెరుగుతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ వినియోగదారులకు ఇది గొప్ప ఊరటగానే చెప్పుకోవచ్చు. ఇదిలావుంటే బుధవారం నుంచి జియో, ఎయిర్‌టెల్.. గురువారం నుంచి వొడాఫోన్ ఐడియా తమ ప్లాన్ల ధరలను దాదాపు 26 శాతం మేర పెంచుతున్నాయి. దీంతో ఒక్కో వినియోగదారునిపై గరిష్ఠంగా రూ.600 భారం పడబోతున్నది.



బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకుంటున్న ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి

ఉన్నత శిఖరాలకు సూచీలు

సెన్సెక్స్ 443, నిఫ్టీ 131 పాయింట్ల వృద్ధి

ముంబై, జూలై 1: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో సూచీలు మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు ముఖ్యంగా ఆసియా, యూరోపియన్ సూచీలు లాభాల్లో మునిగియడంతో దేశీయ మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఒక దశలో 500 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 443.46 పాయింట్లు అందుకొని ఆల్-టైం హైకి 79,476.19 పాయింట్లకు చేరుకున్నది. 30 షేర్ల ఇండెక్స్‌లో 20 షేర్లు లాభపడగా, 10 షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. మరో సూచీ నిఫ్టీ 24 వేల పాయింట్ల పైన ముగిసింది. 131.35 పాయింట్లు అందుకొని 24,141.95 వద్ద స్థిరపడింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.4,43,05,344.036 కోట్లకు చేరుకున్నది.

- టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, టీసీఎస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటర్స్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, లార్సెన్ అండ్ టుబ్రో, సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టాల్లోకి జారుకున్నాయి.
- ఐటీ అత్యధికంగా 1.84 శాతం లాభపడగా.. టెక్ 1.46 శాతం, కమోడిటీస్ 1.21 శాతం, టెలికమ్యూనికేషన్ 1.03 శాతం, మెటల్ రంగ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

అంతర్జాతీయ పేమెంట్స్ కోసం..

వివిధ ఆసియా దేశాలతో కలిసి వెళ్తున్న ఆర్బీఐ

ముంబై, జూలై 1: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. మలేషియా, సింగపూర్ సహా నాలుగు ఆసియా దేశాలు కలిసి వేగవంతమైన రిటైల్ పేమెంట్స్ కోసం ఓ వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. 2026లో ఇది అందుబాటులోకి రావచ్చన్న అంచనాలున్నాయి. దేశీయ ఫాస్ట్ పేమెంట్స్ సిస్టమ్స్ (ఎఫ్‌పీఎస్) ఇంటర్‌లింకింగ్ ద్వారా ఓ ఇన్‌స్టంట్ క్రాస్-బార్డర్ రిటైల్ పేమెంట్స్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధికి బహుళజాతి ఆలోచన ప్రాజెక్ట్ అయిన నెక్సస్‌లో భాగస్వామ్యమైనట్టు ఆర్బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ (బీఐఎస్) ఇన్నోవేషన్ హబ్ కాన్సెప్టే ఈ నెక్సస్. దీని ద్వారా తొలుత భారత్, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్ దేశాల ఎఫ్‌పీఎస్‌ల అనుసంధానం జరుగుతుందని ఆర్బీఐ వివరించింది. ఈ మేరకు జరిగిన ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో ఆర్బీఐతోపాటు ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు, బీఐఎస్ సంతకాలు చేశాయి. ముమ్ముందు మరిన్ని దేశాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతాయని ఆర్బీఐ చెప్పింది.

పూర్తిగా రాని రూ.2వేల నోట్లు

రూ.2వేల నోట్లు పూర్తిగా తిరిగి బ్యాంకుల్లోకి రాలేదని ఆర్బీఐ సోమవారం తెలిపింది. ఇప్పటిదాకా 97.87 శాతం వచ్చినట్టు వివరించింది. ఇంకా రూ.7,581 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని చెప్పింది. గత ఏడాది మే 19న రూ.2వేల నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు వీటి విలువ రూ.3.56 లక్షల కోట్లుగా ఉన్నది. అయితే జూన్ 28 నాటికి ఇది రూ.7,581 కోట్లకు పడిపోయినట్టు ఆర్బీఐ తెలిపింది. దీంతో 97.87 శాతం రూ.2వేల నోట్లు తిరిగి బ్యాంకుల్లోకి వచ్చేశాయని పేర్కొన్నది. ఈ పెద్ద నోట్ల మార్పిడికి ప్రస్తుతం హైదరాబాద్‌సహా దేశంలోని 19 ఆర్బీఐ కార్యాలయాల్లో వీలు కల్పించారు. 2016 నవంబర్‌లో రూ.1000, రూ.500 నోట్ల రద్దు నేపథ్యంలో ఈ రూ.2000 నోట్లు పరిచయమైన సంగతి విదితమే.

కొత్త ఈడీల నియామకం

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా ఆర్నాబ్ కుమార్ చౌధరి, చారులతా ఎస్ కార్‌లను నియమించినట్టు ఆర్బీఐ వెల్లడించింది. ఈ ఇరువురూ మూడేసి శాఖలను పర్యవేక్షిస్తారని కూడా ప్రకటించింది. కార్ నియామకం సోమవారం నుంచే అమల్లోకి రాగా, చౌధరి నియామకం మాత్రం జూన్ 3 నుంచే వర్తిస్తుంది.

యంగ్‌వన్‌లో దుస్తుల తయారీ!

కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్ వెల్లడి

గీసుగొండ, జూలై 1: వరంగల్ జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్లో త్వరలో దుస్తుల తయారీని ప్రారంభించనున్నట్లు యంగ్‌వన్ కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్ తెలిపారు. ప్లాంట్ కోసం కేసీఆర్ ప్రభుత్వం 297 ఎకరాల భూమి కేటాయించినట్లు, పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి గత ప్రభుత్వమే అన్ని రకాల అనుమతులు మంజూరు చేసిందన్నారు. వెయ్యి కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, తద్వారా 11 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఈ యూనిట్‌లో స్పోర్ట్స్, డ్రెస్ మెటీరియల్స్, జర్కిన్స్, సూట్స్ తదితర దుస్తులు తయారుకానున్నాయి. అలాగే శిక్షణ కేంద్రంలో కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌సీసీకి 335 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, జూలై 1: రాష్ట్రానికి చెందిన ప్రముఖ సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్ ఆర్డర్లు ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. గడిచిన నెలలో రూ. 335 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ ఆర్డర్లు బిల్డింగ్ డివిజన్ నుంచి వచ్చాయని తెలిపింది. వీటిలో అంతర్జాతీయ ఆర్డర్లు లేవని పేర్కొంది.

పతంజలి ఫుడ్స్ చేతికి పీఏఎల్ పర్సనల్ కేర్

డీల్ విలువ రూ.1,100 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 1: యోగా గురువు బాబా రాందేవ్ నేతృత్వంలోని పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ (పీఏఎల్)కు చెందిన హోం, పర్సనల్ కేర్ వ్యాపారాన్ని తమ సొంతం చేసుకున్నట్టు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సోమవారం ప్రకటించింది. ఈ అంతర్గత లావాదేవీ విలువ రూ.1,100 కోట్లుగా పేర్కొన్నది. ఐదు విడుతల్లో ఈ చెల్లింపులు జరుగుతాయి. కంపెనీ వాటాదారులు, రుణదాతల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ ఉంటుంది. అలాగే

దీనికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం రావాల్సి ఉన్నది. ప్రధాన ఎఫ్ఎంసీజీ కంపెనీగా ఎదగడానికే ఈ డీల్‌కు దిగినట్టు దేశీయ వంటనూనెల తయారీ దిగ్గజ సంస్థల్లో ఒకటిగా ఉన్న పతంజలి ఫుడ్స్ సంస్థ తెలిపింది. కాగా, ప్రస్తుతం పతంజలి ఫుడ్స్ ప్రమోటర్లలో పీఏఎల్ కూడా ఒకటిగా ఉన్నది. ఇక ఈ డీల్‌తో హెయిర్ కేర్, స్కిన్ కేర్, డెంటల్ కేర్, హోం కేర్ వ్యాపార విభాగాలు పతంజలి ఫుడ్స్ కిందకు వస్తాయి. ఈ డీల్ ఈ ఏడాది సెప్టెంబర్ ఆఖరుకల్లా పూర్తవగలదన్న ఆశాభావాన్ని పతంజలి ఫుడ్స్ సీఈవో సంజీవ్ ఆస్తానా వ్యక్తం చేశారు.

మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

గ్రామీణ ప్రాంతాలకు విస్తరించండి!

మైక్రోసాఫ్ట్‌కు మంత్రి శ్రీధర్ బాబు సూచన

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): మైక్రోసాఫ్ట్ తన కార్యకలాపాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. డాటా సెంటర్ల విస్తరణ పనులు వచ్చే ఏడాదినాటికి పూర్తి చేయాలని తనను కలిసిన మైక్రోసాఫ్ట్ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ భారీ విస్తరణ ప్రణాళిక పూర్తైతే అత్యాధునిక డాటా సెక్యూరిటీ, క్లౌడ్ సొల్యూషన్ రంగంలో హైదరాబాద్ అగ్రస్థానానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని మేకగూడ వద్ద 22 ఎకరాల స్థలం